ప్రజా ఆరోగ్యం కోసమే..

# ఓపెన్ జిమ్

శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం అవసరం

గన్నవరం జడ్పీ హై స్కూల్ ప్లే గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్

ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే 2



18వ వసంతంలోకి...

నేటి దినపత్రిక

సూర్య

ఎన్టీఆర్ - కృష్ణా

బుధవారం 28 ఆగస్టు 2024

పేజీలు 8



మాదక ద్రవ్యాల పేరు వింటేనే..

# ఉలిక్కి పడాలి

- రవాణా విక్రయాలపై ఉక్కు పాదం మోపండి
- గంజాయి, మత్తు పదార్థాల వినియోగం పై గట్టి నిఘా పెట్టండి
- అధికారుల సమష్టి కృషితో మాదక ద్రవ్యాలను నియంత్రించండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. సృజన



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మాదక ద్రవ్యాల వినియోగం పై గట్టి నిఘా పెట్టాలని, గంజాయి మత్తు పదార్థాల రవాణా, అమ్మకాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపి మాదక ద్రవ్యాల పేరు వింటేనే ఉలిక్కి పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. సృజన సంబందిత అధికారులు స్వచ్చంద సంస్థలకు సూచించారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో బాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు వివిధ శాఖల అధికారులు స్వచ్చంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జి.సృజన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఉజ్వల మిగతా 2లో



ముక్త్యాల లిఫ్ట్ ఏర్పాటుకు

# కృషి చేస్తా

పూర్తిస్థాయిలో సాగునీరు, తాగునీరు అందించేందుకు కృషి

ఎంపీ, ఎమ్మెల్యే తాతయ్యకు ఇరిగేషన్ మంత్రి హామీ

వివరాలు 2లో...




రెవిన్యూ వ్యవస్థపై

# నమ్మకం కలిగేలా పనిచేయాలి

- సరైన సరిహద్దులతో సర్వే ధ్రువీకరణ పత్రం అందించాలి
- త్వరలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సిద్ధపడాలి
- రెవిన్యూ కాన్ఫరెన్స్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రెవిన్యూ వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రెవిన్యూ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టర్రేట్ మీకోసం మీటింగ్ హాల్లో రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించి రెవెన్యూ శాఖకు సంబంధించి గ్రీవెన్స్, నీటి తీరువా, నాలా పన్ను వసూళ్లు, మ్యూటేషన్స్, సిసిఆర్సి కార్డుల జారీ, జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూ కేటాయింపులు, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ జారీ, పెండింగ్ అలీనియేషన్స్, చౌకధరల దుకాణాల ఖాళీల భర్తీ, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని అంశాలు సమగ్రంగా సమీక్షించడం జరుగుతుందని, ఇది మొదటి సమావేశమని అన్నారు. 2

చవితి పందిళ్ళకు

# అనుమతి తప్పనిసరి

- రసాయన రహిత వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయండి
- చవితి పందిళ్ళ నిర్వహణలో భద్రత చర్యలను పాటించండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. సృజన



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వినాయక చవితి పండుగా సందర్భంగా జిల్లాలో వినాయక పందిళ్ళు ఏర్పాటు చేసే నిర్వహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందాలని, సాధ్యమైనంత మేరకు రసాయన రహిత మిగతా 6లో...

# సెప్టెంబర్ 1న మొక్కల పంపిణీ

## కలెక్టర్, జేసీకి ఆహ్వాన పత్రికలు





**మచిలీపట్నం, మేజర్‌న్యూస్** : సెప్టెంబర్ ఒకటో తేదీన మొక్కల పంపిణీ పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకి మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ ఆహ్వాన పత్రికలు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయుకులు పాల్గొన్నారు.

# వచ్చే ఏప్రిల్ నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్యారంటీ పెన్షన్






**విజయవాడ, మేజర్ న్యూస్** : నూతన పెన్షన్ విధానం రద్దు కొరకు పోరాడుతున్న ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ చేపట్టిన పలు రకాల నిరసన కార్యక్రమాలకు ఫలితం దక్కింది. ఈ నెల 24న ఎన్సీజెసిఎమ్ సభ్యులు శివగోపాల్ మిశ్రా, కన్నయ్య , శంకర్ రావు తదితరులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించిన సమావేశంలో ఏప్రిల్ 1, 2025 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్యారంటీ పెన్షన్ విధానం అమలులోకి తీసుకువస్తామని వెల్లడించారు. దీనిలో భాగముగా కనీసం 10 సంవత్సరాలు పూర్తీ చేసిన ఉద్యోగులకు కనీస మొత్తం నెలకు 10,000 రూపాయల చొప్పున , అలాగే 25 సంవత్సరాల సర్వీస్ పూర్తీ చేసి పదవి విరమణ చేసిన వారికి చివరి పన్నెండు నెలల జీతం సరాసరి మొత్తంలో సగభాగం పెన్షన్ క్రింద చెల్లించబడుతుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ లీల తెలిపారు. ఈ విధానానికి సంబంధించి పూర్తి వివరాలు త్వరలోనే విడుదల అవుతాయని పేర్కొన్నారు. అలాగే గత సంవత్సరం న్యూ ఢిల్లీలోని రామలీల మైదాన్ లో లక్షల మంది కేంద్ర ప్రభుత్వ కార్మికులతో చేపట్టిన ధర్నా కార్యక్రమం మరియు ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సిహెచ్ శంకర రావు కృషి ఫలితముగా రైల్వే కార్మికులకు ఈ విజయం దక్కిందని లీల తెలిపారు. గ్యారెంటీ పెన్షన్ విధానం ప్రకటించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అలాగే తమ పోరాటాల ద్వారా కృషి చేసిన శివ గోపాల్ మిశ్ర కి, సిహెచ్ శంకర రావు కి పన్నెండు లక్షల రైల్వే కార్మికుల, వారి కుటుంబ సభ్యుల తరపున ధన్యవాదములు తెలియచేస్తున్నామని అన్నారు.

# ఆటోలకు కేసులు రాయొద్దని మంత్రికి ఐఎఫ్టీయూ వినతి



**విజయవాడ, మేజర్ న్యూస్** : నగరంలో గత నాలుగు రోజులుగా అవుట్ ఆఫ్ ఆటోల పేరుతో విపరీతంగా కేసులు రాస్తున్నారు. పదివేల రూపాయల చొప్పున పెనాల్టీలు విధిస్తున్నారు. దీన్ని వెంటనే ఆపేయాలని కోరుతూ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ( ఐ ఎఫ్ టీ యూ అనుబంధం) నాయకులు మంగళవారం రవాణా శాఖ మంత్రి ఎం. రాం ప్రసాద్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. పోలీసు వారు ఆటోలను సీజ్ చేస్తున్నారు. ఈ చర్యలు నగరంలోని ఆటో కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. నిజానికి ఈ అవుట్ ఆఫ్ ఆటోలు ఈరోజు కొత్తగా వచ్చినవి కావు. గత ఏడు ఎనిమిది సంవత్సరాలుగా పర్మిట్లు ఇస్తున్నవే. నగరంలో తిరుగుతున్నవే. నగరములో ఆటోలకు పరిమితి ఉన్నందున విడిగా కొత్త ఆటోలు తీసుకునే వెసులుబాటు లేనందున నగరంలోని నిరుద్యోగులు ఈ విధంగా అవుట్ ఆఫ్ పేరుతో ఆటోలను తీసుకుంటున్నారు. ఈ విషయాలు డిపార్టుమెంటుతో సహా అందరికీ తెలుసు. ప్రారంభంలోనే వీటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు డిపార్ట్మెంట్ తీసుకోలేదు. ఇప్పుడు నగరములో కనీసం పదివేలకు పైగా ఈ అవుట్ ఆఫ్ ఆటోలు ఉన్నాయని తెలుస్తున్నది. ఆటోల అడ్రస్ ఔట్ ఆఫ్ కావచ్చు. కానీ ఆటో డ్రైవర్లు అందరూ విజయవాడ నగర వాసులే... ఆటోలను అమ్మకం చేసిన కంపెనీలు బాగానే ఉంటాయి. లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ఆటో డ్రైవర్లు అవుట్ ఆఫ్ అడ్రస్కు వెళ్లే అవకాశం లేక, నగరంలో డిపార్ట్మెంట్ రాసే కేసులకు పెనాల్టీలు కట్టలేక, ఫైనాన్స్ బాకీలు చెల్లించ లేక ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కావున వెంటనే ఈ అవుట్ ఆఫ్ ఆటోలకు కేసులు రాయకుండా ఆపాలని కోరుతున్నాం. పెనాల్టీల జీవో 21 ని రద్దు చేసి, సవరణలు చేస్తామని ఇచ్చిన టీడీపీ ఎన్నికల హామీని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము. ఇందుకు సంబంధించి పరిష్కార మార్గంగా ప్రతి డ్రైవర్ ఇంటి అడ్రస్ నుండి జిల్లా పరిధితో సంబంధం లేకుండా 60 కిలోమీటర్లు తిరిగే అవకాశం కల్పిస్తే వారికి న్యాయం చేసినట్లు అవుతుంది. జరిగిన తప్పులకు డ్రైవర్లతో పాటు డిపార్ట్మెంట్ పొరపాట్లు కూడా ఉన్నాయి. కావున ఈ సమస్యకు తగిన పరిష్కారం పై పద్ధతుల్లో చూపించాలని కోరుతున్నాం. భవిష్యత్తులో ఇవి మరింత పెరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తదితర విషయాలపై అన్ని ఆటో కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు తీసుకుని న్యాయం చేయాలని నాయకులు మంత్రిని కోరారు.

**మంత్రి హామీ**

ఆటో కార్మికులపై కేసులు రాయకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని నాయకులకు మంత్రి హామీ ఇచ్చారు. ఉప రవాణా కమిషనర్ కి ఫోన్ కాల్ చేసి కేసులు రాయడం తక్షణమే నిలిపి వేయాలని మంత్రి ఆదేశించారు. పోలీసు, రవాణా శాఖాధికారులు, ఆటో సంఘాలతో ఒక సమావేశం తక్షణమే నిర్వహించి అభిప్రాయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఐ ఎఫ్ టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి, నాయకులు ఎ.రవిచంద్ర, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాసరావు, సీహెచ్. పెద్ది రాజు, ముని శంకర్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.




## సామ్‌సంగ్ నుంచి 10 పెద్ద సామర్థ్యపు బెస్పోక్ ఏఐ వాషింగ్ మెషీన్లు

**విజయవాడ, మేజర్ న్యూస్** : కొత్త శ్రేణిలో 10 పెద్ద పరిమాణ, ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను సామ్‌సంగ్ విడుదల చేసింది. ఇవి సహజమైన ఏఐ లక్షణాల ద్వారా లాండ్రీని సరళమైన పనిగా మారుస్తాయి. కొత్త, పెద్ద వాషింగ్ మెషీన్లు 12 కేజీల వీలైన పరిమాణంలో, దుప్పట్లు, కర్టెన్లు, చీరలు వంటి పెద్ద లోడ్లను ఒకేసారి ఉతకడానికి వీలుగా కల్పిస్తాయి. సామ్‌సంగ్ ఇండియా యొక్క కొత్త 12 కేజీల ఏఐ వాషింగ్ మెషీన్‌ల శ్రేణి రూ. 52990 వద్ద ప్రారంభమవుతుంది. కొత్త ఆధునిక వాషింగ్ మెషీన్‌లు ఫ్లాట్ గ్లాస్ డోర్ వంటి బెస్పోక్ డిజైన్, ఏఐ వాష్, ఏఐ ఎనర్జీ మోడ్, ఏఐ కంట్రోల్, ఏఐ ఎకోబబుల్ వంటి అధునాతన ఫీచర్‌లతో వస్తాయి.

## ఇయర్ ఆన్ ఇయర్ 20.8 శాతం డిపాజిట్ వృద్ధిని సాధించిన ఎస్ బ్యాంక్

**విజయవాడ, మేజర్ న్యూస్** : భారతదేశపు ఆరవ అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన ఎస్ బ్యాంక్, మొత్తం డిపాజిట్లలో ఇయర్ ఆన్ ఇయర్ చెప్పుకోదగ్గ రీతిలో 20.9 శాతం వృద్ధిని సాధించింది. ఆర్థిక సంవత్సరం 2025 మొదటి త్రైమాసికం నాటికి ఇది రూ. 2,65,072 కోట్లకు చేరుకుంది. ఈ గణనీయ వృద్ధి, బ్యాంక్‌పై కస్టమర్‌లు ఉంచిన బలమైన నమ్మకం, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. గత నాలుగు సంవత్సరాలలో బ్యాంక్ నమోదు చేసిన విజయవంతమైన టర్న్‌అరౌండ్‌ను ఇది నొక్కి చెబుతుంది. ఇది బ్యాంక్ అమలు చేసిన ఆర్థిక పునాది, కస్టమర్ కేంద్రీకృత వ్యూహాలను కూడా హైలైట్ చేస్తుంది.

## దివిసీమ రత్నకు సేవారత్న అవార్డు గర్వకారణం



**చల్లపల్లి, ఆగస్టు 27, మేజర్ న్యూస్** : దివిసీమ రత్న మండలి బుద్ధ ప్రసాద్ సేవా రత్న అవార్డు పొందటం గర్వకారణమని టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల చెన్నైలో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవారత్న అవార్డు అందుకుని మంగళవారం అవనిగడ్డ వచ్చిన బుద్ధ ప్రసాద్ను రైతునాయకులు నాదెళ్ల వెంకట నరసయ్యతో కలిసి సత్కరించారు.

## మత్తుకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు



**చల్లపల్లి, ఆగస్టు 27, మేజర్ న్యూస్** : యువత మత్తు పదార్ధాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ మురళీధర్ ఆదేశాల మేరకు స్థానిక విజయక్రాంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, విద్యార్థులు సక్రమమైన నడవడిక కలిగి ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్ధాల నిరోధానికి జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గంజాయి రవాణా చేసేవారినీ, మత్తు పదార్ధాలు సేవించే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించనున్నట్లు స్పష్టంచేశారు. గంజాయి, మత్తు పదార్ధాలకు సంబంధించిన సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు వివాదాలు, మత్తుపదార్ధాలకు బానిసై కేసుల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ట్రాఫిక్ నియమాలు, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఐ పిఎస్వి. సుబ్రహ్మణ్యం, కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ పాల్గొన్నారు.



## బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

### కృత్తివెన్ను ఎస్సై ఏ పైడి బాబు

**కృత్తివెన్ను ఆగస్టు 27 మేజర్ న్యూస్ :** అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ మద్యం సీసాలను అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కృత్తివెన్ను ఎస్ఐ ఏ.పైడిబాబు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ గంగాధర్ రావు వారి ఆదేశానుసారం డి.ఎస్.పి అబ్దుల్ సుభాని పర్యవేక్షణలో పెడన సిఐ నాగేంద్ర ప్రసాద్ వారి ఆధ్వర్యంలో నీలిపూడి గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో ఎస్సై బెల్ట్ షాపుపై దాడులు నిర్వహించారు. మద్యం దుకాణంలో 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.14,440 ఉంటుందని ఎస్ఐ వివరించారు. మద్యం అమ్మకం చేపడుతున్న సాన వీర రాఘవయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## చోరీ కేసులో ఏడాది జైలు శిక్ష




**గన్నవరం, ఆగస్టు 27, మేజర్ న్యూస్ :** గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులకు న్యాయస్థానం మంగళవారం శిక్ష విధించింది. 2024 మార్చి 7వ తేదీ రాత్రిలో గన్నవరం హెచ్ సి ఎల్ ఎదురుగా ఉన్న పీజీ హాస్టల్లో నాలుగు సెల్ ఫోన్లను, అదే రోజు దావాజీగూడెం రోడ్ లోని మోడల్ డైరీలో రూ.9,500 నగదు విజయవాడ కృష్ణలంకకు చెందిన మహంకాళి చందు, షేక్ బాషాను చోరీ చేశారు. ఈ ఘటనలో ముద్దాయిలను కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఒక్కొక్కరికీ ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, 500 జరిమానా విధించారు.

## పరిశుభ్రత కార్యక్రమం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, క్రీడలు భారత్ ప్రభుత్వం ఆదేశాలు మేరకు స్థానిక కృష్ణా విశ్వావిద్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ పురస్కరించుకొని ఒక రోజు సామూహిక పరిశుభ్రత కార్యక్రమంను లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నోబుల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మచిలీపట్నం రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించారు. రీజినల్ డైరెక్టర్ ఎన్. సంజయ్ కుమార్, కృష్ణా విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా. ఎం. శ్రావణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలింటర్స్ చేస్తున్న ఈ స్వచ్ఛత కార్యక్రమం అందరికి ఆదర్శం కావాలి అన్నారు. స్వచ్ఛ మచిలీపట్నం కోసం మనమందరం కృషి చెయ్యాలి అన్నారు. 19వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమ డివిజన్ లో జరగటం మా డివిజన్ ప్రజలు అందరికి స్ఫూర్తి అని అన్నారు. ఇటువంటి కార్యక్రమంలకు తమ సహకారం ఎప్పుడు ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నోబెల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్టేడీ యాంప్తిల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు మున్వర్, సురేష్, మహేష్, శ్రీకాంత్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల పిఎఫ్,ఈఎస్ఐ అవకతవకలపై ప్రత్యక్ష విచారణ



### కార్మికుల సమక్షంలోనే పి.ఎఫ్, ఈఎస్ఐ అవకతవకలపై నిగ్గు తేల్చనున్న అధికారులు

### ఫలించనున్న అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ యూనియన్ పోరాటం

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల పిఎఫ్,ఈఎస్ఐ అవకతవకలపై ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించారు. మూడేళ్లుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల, ఏడాదిగా మెడికల్ కాలేజీ లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల జీతాల నుండి మినహాయిస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ములు కార్మికుల ఖాతల్లో జమ కాకపోవడాన్ని నిరసిస్తూ అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ అనే ట్రేడ్ యూనియన్ నిరవధిక సమ్మెకు నోటీసులు ఇచ్చారు.

స్ట్రైక్ నోటీస్ మేరకు సెప్టెంబర్ 4వ తేదీ నుండి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ శానిటేషన్ కార్మికులు నిరవధిక సమ్మెకు సన్నద్ధమయ్యారు. కాగా మంగళవారం అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కుంపటి జయకర్ బాబు, యూనియన్ నాయకులు, సభ్యులు మచిలీపట్నం మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందర చారిని కలిశారు. తమకు జరిగిన అన్యాయంపై ఆసుపత్రి అధికారులకు వివరించారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ సుందరాచారి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్. ఎం. ఓ డాక్టర్ నిరంజన్, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ ఉష, ఇటీవల రిటైర్ అయిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ లతో ప్రత్యేకంగా చర్చించి రోజు రోజుకి ముదురుతున్న పిఎఫ్ ఈఎస్ఐ అవకతవకలపై ప్రత్యక్ష విచారణ సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ తో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు శానిటేషన్ కాంట్రాక్టు సంస్థ ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్వాహకులు మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ యూనియన్ నాయకులు సభ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు



### చల్లపల్లి సీఐ కే. ఈశ్వరరావు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఆశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని చల్లపల్లి సీఐ కే. ఈశ్వరరావు ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త నెంబర్ లనుండి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తామని ఆశ చూపే ఏ విధమైన ప్రకటనలు నిజం కాదని గుర్తించాలన్నారు. మనిషి యొక్క ఆశాను ఆసరాగా తీసుకోని సైబర్ నేరగాళ్ళు తమ కార్యకలాపాలు సాగిస్తుంటారని అలాటి ఆశకు పోయి మోసపోవద్దని సూచించారు. ఏ బ్యాంకు వారు తమ వివరాలు తెలపమని కొరరని అలాంటి మెసేజ్‌లు వస్తే వాటిని నమ్మవద్దని తెలిపారు. ఇతర దేశాలనుండి వచ్చే ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దన్నానారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరగాళ్ళు కొత్త విధానలతో మోసలకు పాల్పడుతున్నారని తెలిపారు. చల్లపల్లి లో ఒక వ్యక్తి ఇటీవల బ్లాక్ ట్రేడింగ్ యాప్ ద్వారా రూ. 27 లక్షలు పోగొట్టుకున్న సంఘటన జరిగిందని తెలిపారు. లోన్ యాప్ ద్వారా ఎవ్వరు లోన్ తీసుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్ కు సమాచారం అందించాలి కోరారు. వ్యాపారస్తులు తమ షాపుల వద్ద సి సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ పి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల్లో ప్రాణ ఆస్తి నష్ట నివారణకు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కంపెనీ యాజమాన్యాలను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు కలెక్టర్ జిల్లాలోని పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఆయా కంపెనీలు పాటిస్తున్న భద్రతా ప్రమాణాలపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కంపెనీ వారి కార్మికులు లేదా ఉద్యోగులు వ్యక్తిగత రక్షణ పరికరాలు (పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్మెంట్) తప్పనిసరిగా ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ మార్గదర్శకాల ప్రకారం గ్లౌస్‌లు, గౌన్‌లు, షూ కవర్‌లు, హెడ్ కవర్‌లు, మాస్క్‌లు, రెస్పిరేటర్‌లు, కంటి రక్షణ, ఫేస్ షీల్డ్‌లు వంటి రక్షణ పరికరాలు కలిగి ఉండాలన్నారు. ప్రమాద సంకేతాలు పరిశ్రమలోని అన్ని ప్రదేశాలలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే చేరే విధంగా పకడ్బందీ ఏర్పాట్లు కలిగి ఉండాలని సూచించారు. కంపెనీలోని కార్మికుల భద్రతే తొలి ప్రాధాన్యమని, పనిచేసే చోట వారి ప్రాణాలకు రక్షణ ఉన్నప్పుడు సహజంగానే కంపెనీ అభివృద్ధి చెందుతుందని ఆయన గుర్తు చేశారు. అనంతరం ఆయన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశానికి సంబంధించిన అజెండా అంశాలపై అధికారులతో చర్చించారు. వీరపనేనిగూడెం, మల్లవల్లి, చల్లపల్లి వంటి ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో పద్ధతిపై అనుమతులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జిల్లా జోనల్ మేనేజర్ మధు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సిఆర్డిఏ జేడి ధనుంజయ రెడ్డి, డిపిఓ నాగేశ్వర నాయక్, ఏఎస్పి ప్రసాద్, లేబర్ డిపార్ట్మెంట్ డిప్యూటీ కమిషనర్ ఆషారాణి తదితరులు పాల్గొన్నారు.



# మీకోసం అర్జీల పరిష్కారంలో సరైన విధానం అనుసరించేలా చైతన్యపరచాలి



## కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మీకోసం అర్జీల పరిష్కారంలో సరైన విధానం అనుసరించేలా క్షేత్రస్థాయి అధికారులను చైతన్యపరచాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కార్యక్రమ విభాగం సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి మీకోసం అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.జి.ఆర్.ఎస్.వెబ్ సైట్లో జిల్లాకు సంబంధించి వచ్చిన కొన్ని అర్జీలను, సంబంధిత ప్రభుత్వ శాఖలు పరిష్కరించిన వివరాలు పరిశీలించారు. అర్జీదారులు తమ దరఖాస్తులలో ఏ సమస్యలు ప్రస్తావించారు లేదా ఏ విజ్ఞప్తులు చేశారు, అందులకు సంబంధిత అధికారులు అప్లోడ్ చేసిన సమాధానం ఏమిటో జిల్లా కలెక్టర్ గమనించారు. అనంతరం సంబంధిత అర్జీదారునికి ఫోన్ చేసి వారు తెలిపిన సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అధికారి ఎవరైనా సంప్రదించారా లేదా వారికి సమాధానం తెలిపారా లేదా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు అర్జీదారులు తమకు వ్రాత మూలకంగా సమాధానం ఇవ్వలేదని తెలపడం జరిగింది. అంతేకాక సంబంధిత శాఖల అధికారులతో కూడా మాట్లాడగా వారు కూడా అర్జీదారులకు సమాధానం పంపలేదని, కలెక్టరేట్లో దరఖాస్తు ఇచ్చారు కాబట్టి వారు సమాధానం పంపుతారని తెలపడం జరిగింది. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఇకపై సంబంధిత శాఖ అధికారి అర్జీపై తీసుకున్న పరిష్కార వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయడమే కాకుండా సంబంధిత అర్జీదారునికి కూడా వ్రాత మూలకంగా సమాధానం తెలిపే విధంగా జిల్లా అధికారులందరూ వారి క్షేత్రస్థాయి అధికారులందరిని చైతన్య పరచాలన్నారు. అంతేకాకుండా అర్జీ వచ్చినప్పుడు సంబంధిత అర్జీదారుని కలిసి వారి సమస్యపై చర్చించి వాస్తవ విషయాలను వివరించి సరైన సమాధానం వ్రాత మూలకంగా తెలియజేయాలన్నారు. ఇకపై తాను యాధృచ్ఛికంగా కొన్ని ప్రభుత్వ శాఖల ద్వారా పరిష్కారం అవుతున్న అర్జీల తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలిస్తానన్నారు. అలాగే జిల్లా అధికారులు కూడా వారి శాఖకు చెందిన క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న అర్జీలను గమనించి ఎప్పటికప్పుడు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులందరికీ ఒక సందేశం ద్వారా సూచనలు జారీ చేశారు. కలెక్టరేట్ లోని మీకోసం విభాగం సిబ్బంది కూడా వారికి కేటాయించిన ప్రభుత్వ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలను ఎలా పరిష్కరించారో ఆన్లైన్లో గమనించి, సంబంధిత అధికారులు, అర్జీదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని నిర్ణీత నమూనాలో వివరాలను పొందుపరిచి తన పరిశీలనకు అందజేయాలన్నారు. అర్జీదారునికి సమాధానం తప్పుగా ఇచ్చి ఉంటే ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డిఆర్ఓ శ్రీదేవి, కలెక్టరేట్ గ్రీవెన్స్ పర్యవేక్షకులు బేగ్, కలెక్టరేట్ మీకోసం విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసిన సిఐ నాయుడు



**నందిగామ, ఆగస్టు 27, మేజర్ న్యూస్:** ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి, అదే విధంగా హెల్మెట్ ధరించాలి అని సీఐ వైవీ ఎల్ నాయుడు అన్నారు. మంగళవారం నాడు గాంధీ సెంటర్లో వాహనాలు తనిఖీ చేసిన సీఐ వైవీ ఎల్ నాయుడు లైసెన్స్, హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు.ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని మైనార్లకు వాహనాలు ఇస్తే ప్రమాదమని సిఐ అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ కు ఆదేశాలు జారీ చేశారు.



## సిఐ నాయుడుకు ఎన్టీఆర్ చిత్రపటం బహుకరణ

**నందిగామ, ఆగస్టు 27, మేజర్ న్యూస్ :** సిఐ వైవిఎల్ నాయుడు కు టిడిపి నాయకులు మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిఖ్యాత నటసార్వభౌముడునటరత్న పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు నటించిన మన దేశం మొదటి సినిమానుండిచివరి సినిమా కవి సార్వభౌమ శ్రీనాథుడవరకు 302 'సినిమాల యొక్క అన్నగారిఆకృతి తో చిత్రపటాన్ని ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు వడ్డేల్లి సాంబశివరావు, నందిగామ నియోజకవర్గ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి షేకు కాజా,పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కొండూరు వెంకట్రావు, 19 వ వార్డు టిడిపి ఇన్చార్జి సూర్య నారాయణ, దాసరి సత్యం, మాగల్లు నందిగామ రైతుపేట తెలుగుదేశం పార్టీ నాయకులుపంతులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు రైల్వే స్టేషన్లో ఎక్స్ ప్రెస్ రైళ్ళు ఆపాలి

## ఎమ్మెల్యే యార్లగడ్డ కు ఏపియుడబ్ల్యూజే వినతి

**గన్నవరం, ఆగస్టు 27, మేజర్ న్యూస్ :** నూజివీడు రైల్వే స్టేషన్లో పలు ఎక్స్ ప్రెస్ రైళ్ళు ఆగేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యూజే) జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి క్యాంప్ కార్యాలయం లో యార్లగడ్డ ను కలిసి ప్రయాణికుల సమస్యలను ఆయనకు వివరించారు. హనుమాన్ జంక్షన్ లో ఉన్న నూజివీడు రైల్వే స్టేషన్ మీదుగా ఎన్నో రైళ్ళు వెళుతున్నా ఇక్కడ మాత్రం ఆగటం లేదన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హనుమాన్ జంక్షన్ నుండి అనునిత్యం 500 మందికి పైగా ప్రయాణికులు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర పట్టణాలకు కి రాకపోకలు సాగిస్తున్నారని, సమీపంలో రైల్వేస్టేషన్ ఉన్నప్పటికీ రైళ్లు అందుబాటులో లేకపోవడంతో రోడ్డు మార్గం ద్వారానే ప్రయాణించాల్సి వస్తుంది అన్నారు. పై పట్టణాలకు రైలు సౌకర్యం లేకపోవడంతో ఆయా పట్టణాల్లో చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగస్తులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హనుమాన్ జంక్షన్ చుట్టుపక్కల పరిశ్రమలు పెరిగిపోవడంతో పాటు, మలవల్లి పారిశ్రామిక వాడ అభివృద్ధిలోకి వస్తుండగా వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడ పరిశ్రమల్లో పని చేసేందుకు వస్తున్న కార్మికులు, ఉద్యోగులు సరైన రైలు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు రైలు సౌకర్యం లేకపోవడంతో రోడ్డుమార్గాన వెళ్లాల్సి వస్తుండడంతో చిరు ఉద్యోగులు, కార్మికులకు ఆర్థికంగా భారంగా మారిందని



ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రివేళ ప్రయాణించే గౌతమి, గోదావరి, గరీబ్ రథ్, పాలక్నామా, కోణార్క్, విశాఖపట్నం - మహబూబ్ నగర్, ప్రశాంతి తదితర ఎక్స్ ప్రెస్ రైళ్లకు నూజివీడు స్టేషన్లో హాల్ట్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీరి వినతికి సానుకూలంగా స్పందించిన యార్లగడ్డ సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు చలమలశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవ దేవాలయాల్లో గోకులాష్టమి వేడుకలు



**నందిగామ, ఆగస్టు 27, మేజర్ న్యూస్ :** మండలంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీకృష్ణమూర్తి రోహిణి జన్మనక్షత్రం అష్టమి తిథి పురస్కరించుకునిమాగల్లు మదన గోపాలస్వామి, పల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి వైఖానస సాంప్రదాయ పద్ధతిలో తిరువంజనం ప్రత్యేక అలంకరణలు అష్టోత్తర సహస్రనామ పూజలు జరిగాయి. స్థానిక సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ ఈవో ఫణికుమార్ పర్యవేక్షణలో ఆండాల గోష్ఠి సభ్యుల సౌజన్యంతో అర్చక స్వాములు దేవి వంశీ శశి కృష్ణమాచార్యుల వేదమంత్రోచ్చారణ నడుమ శ్రీకృష్ణ ఉత్సవ మూర్తికి తిరువంజనం ప్రత్యేక అలంకరణలు, విశేష అర్చనలు పూజలు జరిగాయి.అండాల గోష్టి భక్తుల భక్తి గేయాలు, శ్రీకృష్ణ పరమాత్మ నామస్మరణతో ఆలయం మారుమోగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలు దేవాలయాల వద్ద ఉట్టి కార్యక్రమంలో భక్తులు ఆనందోత్సవాల నడుమ పాల్గొన్నారు.

## హైనీ బాలుర హాస్టల్‌కు ఆర్ఓ ప్లాంట్ వితరణ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** హైనీ బాలుర హాస్టల్ కు మైత్రి ఫౌండేషన్ వారు ఆర్ఓ ప్లాంట్ ను అందజేశారు. మచిలీపట్నం గాంధీ నగరంలో ఉన్న హైని బాలుర హాస్టల్ కు మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఈడేపల్లి కి చెందిన పోలుగాని అశోక్ జన్మదిన సందర్భంగా కుటుంబ సభ్యులు సహకారంతో 20 వేల రూపాయల విలువచేసే ఆర్వో వాటర్ ప్లాంట్ ను వార్డెన్ కు అందజేశారు. వసతి గృహాల్లో నివసించే బాలబాలికల ప్రగతే లక్ష్యంగా మైత్రి ఫౌండేషన్ ద్వారా గత రెండు సంవత్సరాలుగా వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్ తెలిపారు. హాస్టల్ వార్డెన్ మైత్రి ఫౌండేషన్ బృందానికి, దాత అశోక్ కి హాస్టల్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కనకరాజు, రమాదేవి, నిరంజన్ రావు, పెద్ది రామకృష్ణ, శేషు తదితరులు పాల్గొన్నారు.

## ప్రబలనున్న వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### సీజనల్ వ్యాధులపై అధికారులు దృష్టిసారించాలి : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, ఆగస్టు 27, మేజర్ న్యూస్:** గ్రామాల్లో వ్యాధులు ప్రబల కుండా అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. మంగళవారం కాకాని నగర్ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యర్థాలను రహదారులపై నిల్వ చేయకుండా వాహనాల్లో వేరే ప్రాంతాలకు తరలించాలన్నారు. కాలువల్లో దోమలు నివారణ మందు పిచికారీ చేయాలన్నారు.వ్యాధుల సీజన్‌గా పిలవబడే కాలంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రోజూ పారిశుధ్య పనులు నిర్వహించడంతోపాటు వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలో శుభ్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై అవగాహన కల్పించాలి. దాంతోపాటుగా ప్రతి రోజు కాలువల్లో మురుగు తొలగింపు, తడి చెత్త నిల్వ లేకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలలో, కాలువల్లో మురుగునీటిపై వ్యాపించే దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.దోమలను అంతం చేసేందుకు ఎబెట్, పైరిత్రిమ్, మలాథియన్‌తో స్ప్రే, ఫాగింగ్ చేయాలన్నారు. వాటితోపాటు ప్రతి వీధిలోనూ చెత్తను తొలగించిన పిదప బ్లీచింగ్ చల్లి, పట్టణాల్లో పరిశుభ్రమైన వాతావరణం కనిపించేలా చూడాలన్నారు.



## విద్యుద్ఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** విద్యుద్ఘాతంతో వ్యవ సాయ కూలీ మృతి చెందిన విషాదకర సం ఘటన చల్లపల్లి మండలం పాగోలులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీపతి వెంకటేశ్వరరావు(33) వ్యవసాయ కూలీగా పనిచేస్తుంటాడు. స్థానికంగా యక్కటి రాఘవ పొలంలో పనిచేసి మధ్యాహ్నం సమయంలో తిరిగివస్తూ ఒంటికి అంటుకున్న మట్టిని కడుక్కునేందుకు సమీపంలో ఆడు తున్న మోటారు వద్దకు వెళ్లి మట్టికడుక్కునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కలవారు వెంకటేశ్వరరావును చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చల్లపల్లి ఎస్ఐ పిఎస్వి. సుబ్రహ్మణ్యం సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఆ ఇంట అంతులేని విషాదం**

వ్యవసాయ కూలీ వెంకటేశ్వరరావు మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెల కొంది. ఏడాదిన్నర క్రితమే నీలవేణితో వివాహం కాగా, భార్య ఐదు నెలల గర్భిణీగా ఉంది. భార్యాభర్తల దాంపత్యం తొలిదశలోనే భర్త అర్ధాంతరంగా తనువు చాలించటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తు న్నారు. పుట్టబోయే బిడ్డనైనా చూసుకోకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లటం తో ఆ ఇంట అంతులేని విషాదం నెలకొంది.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



**చల్లపల్లి, ఆగస్టు 27, మేజర్ న్యూస్:** చల్లపల్లి మండలంలోని ఎరు వులు, పురుగుమందుల దుకాణాలను చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారిణి జి. సాయి సింధు మంగళవారం తనిఖీ చేశారు. దుకాణా ల్లో రికార్డులను పరిశీలించి నిల్వలను సరిచూశారు. ఈ సందర్భంగా ఏవో సాయిసింధు మాట్లాడుతూ, ఈ పోస్ ద్వారా రైతులకు ఎరువుల అమ్మకాలు జరుగుతు న్నాయనీ, యూరియా.. కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబరు 15వ తేదీ పంట నమోదుకు ఆఖరు తేదీ అన్నారు. పంట నమోదు చేయించుకోని రైతులు పంట నమోదు చేయించుకుని ఈకేవైసీ వేయాలని సూచించారు.

# చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి



**రసాయన రహిత వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయండి..**

**చవితి పందిళ్ల నిర్వహణలో భద్రత చర్యలను పాటించండి..**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. సృజన**

(మొదటిపేజీ తరువాయి)

విగ్రహాలను ఏర్పాటు చేసుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లతో చవితి పందిళ్ళను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన సంబంధిత అధికారులకు సూచించారు. వినాయక చవితి పందిళ్ళ నిర్వహణ, విగ్రహాల నిమజ్జన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ డా. జి. సృజన మంగళవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబుతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా జిల్లాలో పందిళ్ళను ఏర్పాటు చేసి వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకునేందుకు చవితి పందిళ్ళను ఏర్పాటుచేసే నిర్వహకులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పోలిస్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పందిళ్ళ ఏర్పాట్లకు నిర్వహకులు ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న ధరఖాస్తులను పోలీస్, అగ్నిమాపక, నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు అనుమతి మంజూరు చేయాలన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు కానీసం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసుకుని వారి వివరాలు గుర్తింపు కార్డులను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పందిళ్ళు విగ్రహాల ఏర్పాటుకు ప్రైవేట్ స్థలమైతే స్థల యాజమాని నుండి, ప్రభుత్వ స్థలం అయితే సంబంధిత పంచాయతీ మున్సిపల్ అధికారుల అనుమతి పొంద వలసి ఉంటుందన్నారు. ఏర్పాటు చేసే విగ్రహాం ఎత్తు బరువు ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య నిమజ్జనం మార్గం ఉపయోగించే వాహన వివరాలను ముందుగానే పొందుపరచాలన్నారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల మాత్రమే సౌండ్ బాక్స్‌లను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత మేరకు మట్టి విగ్రహాలు లేదా రసాయన రహిత విగ్రహాలను ఏర్పాటు చేసుకునేలా నిర్వహకులు ప్రోత్సహించాలన్నారు. పందిళ్లలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పందిళ్లు వద్ద ఎటువంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. పందిళ్లలో ఏర్పాటు చేసే విద్యుత్ అలంకరణ వలన షార్ట్ సర్క్యూట్‌లకు తావులేకుండా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను సిద్దంగా ఉంచాలని మత్స్య శాఖ అధికారులను, ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నగర పోలీస్ కమీషనర్ రాజశేఖర్ మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో 2328 విగ్రహాలు, నిమజ్జనం చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది గణేష్ ఉత్సవాల సందర్భంగా పందిళ్లను ఏర్పాటు చేసుకునే నిర్వహకులు ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందాలని సూచించడం జరిగిందన్నారు. పందిళ్ల వద్ద పోలీస్ పహర ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పందిళ్లలో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. భద్రత కొరకు రాత్రి సమయంలో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపాల ఉండేలా చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన ప్రదేశాలలో క్రేయిన్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద నిమజ్జనం సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి ఏర్పాటు చేసిన ప్రదేశాలలోనే కాకుండా కాలువలు నదీ పరివాహక ప్రాంతాలలో విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశాలు ఉంటాయని అటువంటి ప్రదేశాలను ముందుగానే గుర్తించి పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, కార్పొరేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో వినాయక చవితి పందిళ్ళ ఏర్పాటు నిమజ్జనం కార్యక్రమాలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమీషనర్ కోరారు. ఈ సమావేశంలో డిసిపిలు గౌతమి శాలి, కె.యం మహేశ్వరావు, కె. చక్రవర్తి, ఎసిపి కె. వెంకటేశ్వరరావు, జిల్లా రెవిన్యూ అధికారి వి. శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శ్రీనివాసరావు, అగ్నిమాపక అధికారి ఎ.వి. శంకర్‌రావు, విజయవాడ, తిరువూరు, నందిగామ ఆర్‌డివోలు బి.హెచ్ భవానిశంకర్, కె. మాధవి, ఎ. రవీంద్రరావు, నగర పాలక సంస్థ అడిషనల్ కమీషనర్ కె. మహేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# స్మాల్ అండ్ మీడియం పత్రికల సమస్యలు పరిష్కరించాలి

**ఏపీ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానం**

**నూతన కార్యవర్గం ఎన్నిక**

**విజయవాడ మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ సమాచారం, పౌర సంబంధాల శాఖలో ఎంప్యానల్ మెంట్ కలిగిన దినపత్రికల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ మేరకు విజయవాడలోని రెవెన్యూ భవనంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్మాల్ అండ్ మీడియం పత్రికల అభివృద్ధికి కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. ఆయా పత్రికలకు క్రమం తప్పకుండా యాడ్స్ విడుదల ఎంప్యానల్ మెంట్ లేని పత్రికలకు ఆ సదుపాయం, అక్రిడేషన్ల పెంపుదల, తదితర సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేయాలని తీర్మానించింది. ఈ సమావేశం ఏకగ్రీవంగా అసోసియేషన్ అధ్యక్షునిగా వి. శ్రీరామ్ యాదవ్ (విజయవాడ ),ప్రధాన కార్యదర్శిగా పి. సత్యనారాయణ (విశాఖపట్నం), ఉపాధ్యక్షులుగా డి. నాగరాజు (విజయవాడ ), వి. ప్రసాద్ కుమార్ (నెల్లూరు ), ఎన్. కోటేశ్వరరావు (గుంటూరు ), వెంకట రెడ్డి (కడప ), కార్యదర్శులుగా ఎం. శ్రీనివాస రావు (గుంటూరు ), సి హెచ్. అప్పలనాయుడు(శ్రీకాకుళం ),టి. మారుతి చౌదరి (బాపట్ల ), దొండా రమేష్(విశాఖపట్నం ), కోశాధికారిగా ఏ. వి. వి. శ్రీనివాసరావు (ఏలూరు ),ఈసీ మెంబర్లు గా శర్మ, టి. ప్రవీన్ కుమార్, పైలా శ్రీనివాసరావు తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి వెంకట రాజేష్ అభినందించా రు. అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి లతోపాటు పలువురుని సత్కరించారు. సమాచార రంగంలో స్థానిక పత్రికలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని మీడియా సామాజిక బాధ్యతతో పనిచేయడం వల్లే ప్రజా సమస్యలతో పాటు ఉద్యోగులు, ఇతర వర్గాల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు.




**చేయూత నివ్వండి : సమాచార డైరెక్టర్ కు అసోసియేషన్ వినతి**

అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా స్మాల్ అండ్ మీడియం పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను సమాచార, సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాంసు శుక్లా దృష్టికి తెచ్చారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయన కార్యాలయంలో మంగళవారం అంద చేశారు . పెద్ద పేపర్లకు యాడ్స్ విడుదల చేసినప్పుడల్లా స్మాల్ అండ్ మీడియం దినపత్రికలకు యాడ్స్ విడుదల చేయాలని, తెలంగాణాలో వలె నెలకొక ఫుల్ పేజీ యాడ్ ఇవ్వాలని, ఎంప్యానల్ మెంట్ సదుపాయం కల్పించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని,ప్రకటన రేట్లు పెంచాలని కోరారు. పబ్లికేషన్స్ సెంటర్ తో పాటు ఇతర జిల్లాల్లో, స్టేట్ హెడ్ క్వార్టర్ లో కూడా అక్రిడేషన్లు కల్పించి వాటి సంఖ్యను పెంచాలని కోరారు.దీనిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ - నీతి ఆయోగ్ ప్రతినిధులతో సీఎం








**విజయవాడ మేజర్ న్యూస్:** 2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు నీతి ఆయోగ్‌కు స్పష్టం చేశారు. నీతి ఆయోగ్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. వికసిత ఏపీ-2047 డాక్యుమెంట్ రూపకల్పనపై చర్చించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అందుకోసమే ఏపీ విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. నీతి ఆయోగ్ ప్రతినిధులతో సమావేశమైన సీఎం వికసిత్ ఏపీ - 2047 డాక్యుమెంట్ రూపకల్పనపై చర్చించారు.

**జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం**

నీతి ఆయోగ్ ప్రతినిధులతో చంద్రబాబు సచివాలయంలో భేటీ అయ్యారు. వికసిత్ భారత్, వికసిత్ ఏపీపై చర్చించారు. విజన్ - 2047 డాక్యుమెంట్ రూపకల్పనపై నీతి ఆయోగ్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు. 12 అంశాలతో వికసిత్ ఏపీ డాక్యుమెంట్ రూపకల్పనపై వివరించారు. 2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని నీతి ఆయోగ్ ప్రతినిధులకు సీఎం స్పష్టం చేశారు. అందుకోసమే ఏపీ విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఐదేళ్లకు జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

**అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి**

రాష్ట్రాన్ని ఆహారశుద్ధి పరిశ్రమల కేంద్రంగా రూపొందించే అంశంపై ప్రణాళికలను సీఎం చంద్రబాబు నీతి ఆయోగ్ ప్రతినిధులకు వివరించారు. విద్యుతో పాటు పారిశ్రామికంగా యువతలో నైపుణ్యం పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. దేశ తూర్పు తీర ప్రాంతానికి లాజిస్టిక్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడించారు. పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు సీఎం నీతి ఆయోగ్ ప్రతినిధులకు తెలిపారు. ఏపీలోని వివిధ నగరాలను గ్రోత్ సెంటర్లుగా మార్చేలా ప్రణాళిక తయారుచేస్తున్నట్లు వివరించారు. అందరికీ అత్యాధునిక వైద్యం కల్పించేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పర్యావరణ అనుకూల అభివృద్ధిపై దృష్టి పెట్టేలా రూపొందించిన ప్రణాళికలను నీతి ఆయోగ్ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు వివరించారు. డిజిటల్ గవర్నెన్స్, ఆర్థికాభివృద్ధికి ఏపీని ఓ నమూనాగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు జగన్ బహిరంగ లేఖ

**ప్రజారోగ్యానికి కూటమి సర్కారు ఉరి బిగిస్తోందన్న జగన్**

**సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తున్నారని ఆగ్రహం**

**వెంటనే ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకురావాలంటూ లేఖ**

**విజయవాడ మేజర్ న్యూస్:** రాష్ట్రంలో ప్రజారోగ్య రంగానికి మీ ప్రభుత్వం ఉరితాడు బిగిస్తోంది అంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తున్నారని, ఇప్పటికే స్పెషలిస్ట్ డాక్టర్ల సహా సిబ్బంది నియామకాలను ఆపడంతో జీరో వేకెన్సీ పాలసీకి గండి కొడుతున్నారని జగన్ విమర్శించారు. మరోవంక బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని నీరుగారుస్తున్నారని, తద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తిరిగి ఆస్తులు అమ్ముకునే పరిస్థితిని తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది కొత్తగా ప్రారంభం కావాల్సిన ఐదు మెడికల్ కాలేజీలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ ఏడాది ఆయా కాలేజీల్లో తరగతులు ప్రారంభం కాకపోవడం మీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం అని జగన్ స్పష్టం చేశారు. "అన్ని వసతులు ఉన్నప్పటికీ మీ వైఖరి కారణంగా ఈ కాలేజీలకు గ్రహణం పట్టింది. కేంద్రంలోని బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ మీరు అనుమతులు తెప్పుకోలేకపోయారు. ఇది మీ వైఫల్యమే. మీ మద్దతుపైనే కేంద్ర ప్రభుత్వం ఆధార పడి ఉంది. ఆ పలుకుబడిని వాడుకుని ఆ ఐదు మెడికల్ కాలేజీలకు వెంటనే అనుమతులు తీసుకురావాలని కోరుతున్నాను" అంటూ జగన్ తన లేఖలో పేర్కొన్నారు.

# అన్నం పెట్టే రైతుకు అండగా ప్రభుత్వం నిలుస్తుంది

**రాష్ట్రంలో ఎక్కడా డి.ఎ.పి., యూరియా తూనికలు, ధరల్లో తేడాలు లేకుండా డీలర్లు చూసుకోవాలి**

**కొత్త చట్టాలను అనుసరించి నడుచుకోవాలి**

**రైతును మోసం చేస్తే ఉపేక్షించేది లేదు**

**ఎరువులు తయారీదారులు, డీలర్ల సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**





**విజయవాడ మేజర్ న్యూస్:** 'కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వం. ప్రతి అడుగులో రైతుని ఆదుకునేందుకు అంకిత భావంతో పని చేస్తుంది. రైతుకి భరోసా ఇచ్చే విధంగా ముందుకు వెళ్తుంద'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరువులు, పురుగు మం దుల తయారీదార్లు, డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యూరియా, డి.ఏ.పి., ఎరువులు, పురుగు మందుల అమ్మకాల విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కొలతలు, ధరల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. రైతు మోసపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బరువు, ఎమ్మార్పీల్లో తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ జనవరి నుంచి అమల్లోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ నిబంధనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ బి. రామ్ కుమార్ తూనికలు, కొలతల శాఖలో కొత్తగా వచ్చిన చట్టాలు, నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుకి ఎక్కడా ఇబ్బంది కలుగకుండా, అన్నదాతకు భరోసా కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ముందుకు వెళ్తున్నాం. ధాన్యం సేకరణ దగ్గర నుంచి కనీస మద్దతు ధర పకడ్బందీగా ప్రతి రైతుకీ అందించే విధంగా ఈ ఖరీఫ్ సమయానికి సిద్ధం అవుతున్నాం. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తూనికలు, కొలతల శాఖ నిర్వహించిన తనిఖీల్లో యూరియా, డీఏపీ ధరలు, కొలతల్లో తేడాలు, బ్లాక్ మార్కెటింగ్ కారణంగా రైతులకు ఇబ్బంది కలుగుతున్న విషయం దృష్టికి వచ్చింది. కొన్ని చోట్ల దుకాణాల వద్ద ఎంఆర్పీని రౌండ్ ఫిగర్ చేసి అమ్ముతున్నారు. రైతులు ఎంత కష్టపడి పంట పండిస్తున్నారో అందరికీ తెలుసు. ఎంఆర్పీ కంటే ఎక్కువ ధర తీసుకోవడం అంటే మోసం చేస్తున్నారన్న భావన రైతుల్లో కలుగుతుంది.

**252 కేసులు నమోదు**

తూనికలు, కొలతల శాఖ నుంచి ఇటీవల క్షేత్ర స్థాయిలో చేపట్టిన తనిఖీల్లో రాష్ట్రవ్యాప్తంగా 252 కేసులు నమోదు చేశాం. అందులో ఎక్కువ కేసులు కొలతల్లో తేడాలు ఉన్నాయని పెట్టినవే ఉన్నాయి. రైతుని ఇబ్బంది పెట్టే విధంగా కొలతల్లో తేడాలు చేస్తే ఉపేక్షించేది లేదు. ఒక్కోచోట బస్తాకి రెండు, మూడు కేజీలు తేడాలు ఉంటున్నాయి. కొలతల విషయంలో తేడాలు ఉండకూడదు. ప్రతి బ్యాగు బరువు చూసి అమ్మాలి. మరికొన్ని అధిక ధరల వసూళ్లకు సంబంధించిన కేసులు ఉన్నాయి. రవాణాలో బరువు తగ్గితే ఉన్న కొలత లెక్క కట్టి దాని మేరకే ధర చెల్లించే ఏర్పాటు చేయాలి. ఎక్కడా రైతుకి మాత్రం ఇబ్బంది కలుగ కుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

**గత ప్రభుత్వంలో రైతులు ఇబ్బంది పడ్డారు**

గత ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులుపడ్డారు. ఎరువులు, విత్తనాల కొరత ప్రధానంగా రైతుని ఇబ్బందిపెట్టింది. మన ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెలా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షించి రైతుల పక్షాన నిలబడతాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాల్లో ఎప్పటికప్పుడు మార్పులు వస్తాయి. మారిన చట్టాలకు అనుగుణంగా అంతా ముందుకు వెళ్లాలి. కొత్తగా అమల్లోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ నిబంధనను తయారీదార్లు కచ్చితంగా అమలు చేయాలి. అదే సమయంలో తయారీదార్లు క్షేత్ర స్థాయిలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా దృష్టి సారించాలి. తయారీదార్లు, డీలర్లకి కొత్త చట్టాల పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేశాం. ప్రభుత్వం ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటుంది. రైతుకి భరోసా కల్పించకపోతే మనం తప్పు చేసిన వారిమవుతాము.

**రైతు సంతోషమే మన సంతోషం**

మా ప్రభుత్వం ఎల్లవేళలా వినియోగదారుడి పక్షాన నిలబడుతుంది. రైతు సంతోషంగా ఉంటేనే మనమంతా సంతోషంగా ఉంటాము. సరుకు కొరత వల్ల బ్లాక్ మార్కెట్ జరుగుతోందని చెబుతున్నారు. మనం మంచి చేయాలి అనుకుంటే ఎలాగైనా చేయొచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు ధరల్ని నియంత్రించిన విధానం అందుకు ఉదాహరణ. కంది పప్పు కేజీ రూ.180 ఉన్నప్పుడు హోల్ సేలర్స్, రిటెయిలర్స్ తో సమావేశం ఏర్పాటు చేస్తే మొదట రూ.160కి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఇప్పుడు శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు మరో రూ.10 తగ్గించి రూ.150కి కేజీ ప్రజలకు ఇవ్వగలుగుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు. తయారీదార్లు, డీలర్లు రైతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్లాలి. ఖరీఫ్ సమయానికి మీ నుంచి సహకారం అవసరం. ఉద్దేశపూర్వకంగా ఎవరి మీదా కేసులు పెట్టం. ప్రభుత్వపరంగా చట్టానికి లోబడి ముందుకు వెళ్తాం. అంతా రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. రైతుని కాపాడుకుందాం" అన్నారు.

# స్పష్టమైన ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికలుండాలి

## 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలపై కలెక్టర్ డా. జి.సృజన





**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** విస్తృత ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి శాఖా 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేసి, లక్ష్యాలను చేరుకునేందుకు నిబద్ధతతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన.. అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో వి.శ్రీనివాసరావుతో కలిసి జిల్లాస్థాయిలో శాఖల 100 రోజులు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రూపొందించిన ముసాయిదా ప్రణాళికలపై శాఖల వారీగా చర్చించి.. చేర్చాల్సిన అంశాలపై మార్గనిర్దేశం చేశారు. 100 రోజుల్లో పూర్తిచేసే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతో పాటు ఏడాదిలో చేపట్టే పనులకు సంబంధించి ప్రతిపాదనలు, లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో డాక్యుమెంట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. లక్ష్యం ఎంత స్పష్టంగా ఉంటే దాన్ని సాధించేందుకు అంతే కచ్చితత్వంతో కార్యాచరణ రూపకల్పనకు వీలవుతుందన్నారు. ప్రణాళికల రూపకల్పనలో బలాలు, బలహీనతలు, అవకాశాలు, ముప్పులు (స్వాట్) విశ్లేషణ కూడా ముఖ్యమన్నారు. వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రణాళికాయుతంగా సాధించేందుకు కృషిచేయాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. మహేశ్వరరావు, కేఆర్ ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈవో యు.వి.సుబ్బారావు, డీపీవో ఎన్వీ శివప్రసాద్ యాదవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

### కృత్తివెన్ను ఎస్ఐ ఏ.పైడిబాబు

**కృత్తివెన్ను ఆగస్టు 27 మేజర్ న్యూస్ :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కృత్తివెన్ను ఎస్ఐ ఏ.పైడి బాబు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ గంగాధర్ రావు వారి ఆదేశానుసారం డి.ఎస్.పి అబ్దుల్ సుభాని పర్యవేక్షణలో పెడన సిఐ నాగేంద్ర ప్రసాద్ వారి ఆధ్వర్యంలో సీతనపల్లి వద్ద ఉన్న నవ జ్యోతి విద్యాసంస్థలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యువత గంజాయి, మద్యం తదితర మత్తు మందులకు బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాటి వల్ల తమ భవిష్యత్తును అంధకారంగా మార్చుకుంటున్నారని ఎస్ఐ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కాలేజీలకు చదువుకోమని పంపిస్తుంటే కొంతమంది పిల్లలు చదువులు మానేసి అనవసరమైన వాటితో సమయాన్ని వృథా చేసుకుంటూ తమ భవిష్యత్తును చేజేతుల నాశనం చేసుకుంటున్నారు అలా ఉండకుండా ప్రతి విద్యార్థి మంచి చదువులు చదువుకుని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారికి సూచించారు. మీ పరిసర



ప్రాంతాలలో గాని మీ స్నేహితుల్లో గాని మీకు తెలిసిన వారు ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారిని నిరోధించి ఎక్కడ మత్తు పదార్థాలు అమ్ముతున్నారో మాకు సమాచారం ఇస్తే మేము వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యంతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

### వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశం



**గన్నవరం, ఆగస్టు 27, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ అప్రమత్తమయ్యారు. మంగళవారం గన్నవరంలోని శాసనసభ్యుని క్యాంప్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్వో గీతా భాయ్‌తో సహా అన్ని మండలాల వైద్యశాఖ అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ నియోజక వర్గంలో విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయితీ అధికారులతో సమన్వయం చేసుకొని బ్లీచింగ్, ఫాగింగ్ చేయడం, యాంటీ లార్వా ఆపరే షన్లు లాంటివి చేయాలని సూచించారు. వైద్య శాఖ పరంగా అన్ని గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని అవసరమైన మందులు అందుబాటులోకి ఉంచుకోవాలని ఆదేశించారు. మరణాలు కలగకుండా అప్రమత్తంగా ఉండి ఎప్పటిక పుడు సమాచారాన్ని అందించాలని ఆరోగ్యశాఖ అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య కేంద్రం నుంచి రోజువారీ ఫీవర్ కేసుల నివేదికలు ఇవ్వాల న్నారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలోని ఏ గ్రామంలోనైనా డెంగ్యూ కేసు నమోదైతే వెంటనే డాక్టర్ల బృందం ఆ గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలు సేకరించి, రక్త పరీక్షలకు పంపించాలని అన్నారు. ఆ గ్రామానికి చుట్టుపక్కల ప్రజలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంప్ నిర్వహించాలని సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం డిఎంహెచ్వో గీతా భాయ్ మీడియాతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులలో భాగంగా వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని వాటి మీద దృష్టి సారించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సూచించారని చెప్పారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సర్వే చేయడం జరిగిందన్నారు. సర్వే లో 267 కేసులు ఫీవర్ కేసులు ఉన్నాయని గుర్తించామని అందులో 41 టైఫాయిడ్ కేసులు ఉండగా మిగిలిన కేసులు విషజ్వరాలుగా గుర్తించడం జరిగిందన్నారు. బాధితులు వైద్యశాఖ పరిధిలో చికిత్స చేసుకొని ఇంటివద్దే వున్నారని చెప్పారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని దగ్గరుండి ఆసుపత్రికి పంపించడం జరుగుతుందన్నారు.



## వ్యక్తిత్వ వికాసం ప్రోగ్రాం

**జగ్గయ్యపేట ఆగష్టు 27 మేజర్ న్యూస్ :** మండలంలో గండ్రాయి గ్రామ జడ్పీహెచ్ పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. దీనిలో ఏ.పీ.జే అబ్దుల్ కలాం లీడ్ ఇండియా 2020 ప్రోగ్రాం ట్రైనర్ రావూరి రాజు జిల్లా షెడ్యూల్ కులాల అధికారిగా పనిచేసే రిటైర్డ్ అయిన వీరు పదో తరగతి విద్యార్థులకు పదవ తరగతిలో 90% కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవడం ఎంత అవసరం, దాని ద్వారా ట్రిబుల్ ఐటీ ఇడుపుల పాయ, నూజివీడు,శ్రీకాకుళం, ఒంగోలు లో ఉచిత ప్రవేశం ఎలా సాధించవచ్చు అనే విషయాన్ని వివరించి విద్యార్థులలో ప్రేరణ కలిగించారు. భారత దేశం నుండి ఇతర దేశాలలో ఎలా స్థిరపడవచ్చు అన్న విషయాన్ని వివరించుచు ఆ ప్రాధాన్యత తెలియజేశారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నెహ్రూ ఆశయం,కలలు కనండి వాటిని సాధించుటకు ఇష్టపడి చదవండి సాధించి తల్లిదండ్రుల పాఠశాల పేరు పతాక స్థాయిలో నిలపండి అన్న అబ్దుల్ కలాం ఆశయం సాధించండి, అంటూ సాగిన కార్యక్రమం విద్యార్థుల వ్యక్తిత్వ వికాస కార్యక్రమం సాగింది. దీనిలో దేశబోయిన సైదులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటో రిక్షాలకు పోలీసు నంబరింగ్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సీపీ యస్.వి.రాజశేఖర్ బాబు సూచనల మేరకు విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించుటలో భాగంగా పరిమితికి మించి తిరుగుచున్న ఆటోరిక్షాలను గుర్తించుటకు, సదరు ఆటో రిక్షాలకు పోలీసు నంబరింగ్ ఇచ్చుటకు నిర్ణయించారు. పోలీసు నెంబర్ కొరకు చివరి తేదీ ఆగస్టు 31వ తేదీ ఆఖరు తేదీగా నిర్ణయించారు. పై విషయంపై ఆటో రిక్షాల యజమానులు తమ యొక్క ఆటోరిక్షాల యొక్క రికార్డులు, ఆధార్ కార్డు తప్పని సరిగా కలిగి ఉండాలి.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం




**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. కృష్ణా విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం భాగస్వాములు అవుదాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఆ తరం విశ్వవిద్యాలయ ఆవరణలో విద్యార్థుల తో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం వి బసవేశ్వర రావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్.ఉష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి, ప్రోగ్రామ్ అధికారులు గోపి, కవిత, పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999